క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11 కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ ఎం.విజయ్‌భాస్కర్ తెలిపారు. బర్కత్‌పురా ఫీడర్ పరిధిలో కూరగాయల మార్కెట్, ఎస్ఎల్ డయగ్నోస్టిక్ సెంటర్, యాక్సిస్ బ్యాంక్, మూన్ కేఫ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

విజయ యువజన సంఘం అధ్యక్షుడిగా రాంరెడ్డి



రాంరెడ్డిని సత్కరిస్తున్న సంఘం సభ్యులు

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ దాయరా మార్కెట్‌లోని విజయ యువజన సంఘం అధ్యక్ష ఎన్నికలు సోమవారం జరిగాయి. బొల్లపల్లి రాంరెడ్డి, పరకాల రజనీకాంత్‌లు అధ్యక్ష స్థానం కోసం పోటీపడ్డారు. 163 ఓట్లు పోల్ అవ్వగా బోల్లంపల్లి రాంరెడ్డికి 90, పరకాల రజనీకాంత్‌కు 73 ఓట్లు వచ్చాయి. 17 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. అడ్‌హాక్ కమిటీ సభ్యులు జనార్దన్, లింగాల శ్రీకాంత్‌గౌడ్, జనార్దన్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, యాదగిరిలు పాల్గొనగా.. ప్రేమ్‌రాజ్, దయానంద్, కృష్ణారావు, మాజీ అధ్యక్షులు సుదర్శన్ తదితరులున్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీరాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... జామై ఉస్మానియా – ఆర్ట్స్ కాలేజీ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (60) రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి ఒంటిపై సిమెంట్ రంగు నలుపు, తెలుపు గీతల చొక్కా, ఎరుపు రంగు ఫ్యాంట్ ఉంది. ఈ మేరకు కాచిగూడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణంపై నిరసన

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్ నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణంలో అధికారుల అలసత్వం కారణంగా ఓ ఇల్లు ధ్వంసమైంది. హిమాయత్‌నగర్ నుంచి గోల్నాక వరకు ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా నిర్మాణం చేపట్టడంతో స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శనివారం సాయంత్రం హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్–14 వద్ద స్థానికుడు శరభయ్య ఇల్లు ధ్వంసమైంది. మూడు రోజులు గడుస్తున్నా ఇటు ఇరిగేషన్ అటు జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేయకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. అధికారులు ఇష్టారీతిలో నిర్మిస్తుండటంతో మురుగునీరు ఇదే ప్రాంతంలోని ఓ ప్రార్థన మందిరంలోకి చేరుకున్నాయి. స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తం కావడంతో సోమవారం ఇరిగేషన్ ఈఈ శంకరయ్య, డీఈ ప్రవీణ్, ఏఈ అరుణ, జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సాయిబాబా, కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మిలు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు తీవ్రమైన విమర్శలు చేశారు. దీంతో శరభయ్య ఇంటికి నష్టపరిహారం చెల్లిస్తామంటూ అధికారులు వెల్లడించారు.

అగ్నిమాపక శాఖ వాహన ర్యాలీకి ఘన స్వాగతం

మలక్‌పేట: అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా సోమవారం తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో వాహన ర్యాలీ నిర్వహించారు. గౌలిగూడ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్తున్న ర్యాలీకి మలక్‌పేట మెట్రో స్టేషన్ వద్ద మలక్‌పేట ఫైర్ ఆఫీసర్ ఎండీ ముస్తాఫా నేతృత్వంలో ఘనంగా స్వాగతం పలికారు. ర్యాలీలో పాల్గొన్న అధికారులకు, సిబ్బందికి శీతల పానీయాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, అగ్నిప్రమాద ఘటన వివరాలు చెప్పేటప్పుడు కంగారు పడకుండా ప్రశాంతంగా చెప్పాలన్నారు. సమాచారం ఇచ్చేటప్పుడు పూర్తి చిరునామా, ల్యాండ్ మార్కులు చెప్పాలని సూచించారు. స్వాగతం పలికిన వారిలో ప్రముఖ వ్యాపారవేత్త, టీఆర్ఎస్ అధ్యక్షుడు మంచికంటి జగన్‌గుప్తా, నాయకులు మహేష్‌కుమార్, వెంకట్, నర్సింగ్, సందీప్, కిరణ్, వెంకటేష్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.



రూ.9 లక్షలతో అభివృద్ధి పనులు



డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం బాగ్అంబర్‌పేట డివిజన్ దోభీగల్లీలో రూ.9 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల నాటి పైపులైన్ వ్యవస్థను దశలవారీగా ఆధునీకరించి ప్రజలకు తాగునీరు, డ్రైనేజీ, తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. కలుషిత నీరు, వీధిలైట్లు ప్రధాన సమస్యగా ఉందని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. డ్రైనేజీ పనులు సకాలంలో పూర్తి చేసి జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమన్వయ లోపాన్ని సహించేది లేదన్నారు. జలమండలి మేనేజర్ మజీద్, జీహెచ్ఎంసీ అధికారులు సిబ్బంది, బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, చుక్కా జగన్, బీఆర్ఎస్ నాయకులు చందు, శ్రీరాములు ముదిరాజ్, రవీందర్, రమేష్ నాయక్, శివమూర్తి తదితరులున్నారు.



కార్పొరేటర్ లావణ్య శ్రీనివాస్‌గౌడ్, అధికారులు

ప్రజా సమస్యల పరిష్కారానికి వంద రోజులు..

ప్రజా సమస్యల పరిష్కారానికి 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం డివిజన్‌లోని జైస్వాల్‌గార్డెన్‌లో వివిధ విభాగాల అధికారులతో కలిసి ప్రజా సమస్యలపై పర్యటించారు. జైస్వాల్ గార్డెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మ్యాన్‌హోల్స్, పారిశుద్ధ్యం, వీధిలైట్లు, లోప్రెషర్ నీటి సరఫరా వంటి సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని ఆమె ప్రజలకు హామీ ఇచ్చారు. వివిధ విభాగాల అధికారులు, జైస్వాల్ గార్డెన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారు'



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: భోలక్‌పూర్‌లోని హెరిటేజ్ ఫంక్షన్‌హాల్‌లో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు అధ్యక్షత బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని గతంలో ఉన్న ఎమ్మెల్యే చేయలేని అభివృద్ధిని గత నాలుగేళ్లలో తాము చేసి చూపించామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనుల నిమిత్తం తాము నిధులను మంజూరు చేయిస్తే బీజేపీ నేతలు తామే చేయించామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

- నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారనికి కష్టపడి పని చేస్తున్నామన్నారు. ఇది చూసి ఓర్వలేకే బీజేపీ నేతలు తమ రాజకీయ లబ్ధికోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.
- తాము చేసిన అభివృద్ధి వల్లే వచ్చే ఎన్నికల్లో ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.
- సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నగర ఇన్‌చార్జ్ దాసోజు శ్రవణ్ అన్నారు.
- బీజేపీ నాయకులు అభివృద్ధిని మరచి కేవలం బీఆర్ఎస్ నేతలపై తప్పుడు ఆరోపణలు చేయడమే మాట్లాడుతున్నారన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ తలసాని సాయికిరణ్‌యాదవ్, బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రెబ్బ రామారావు, బింగి నవీన్, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకులు షరీఫ్, రహీం, మాజీ కార్పొరేటర్లు రవీందర్, ముఠా పద్మానరేష్ బీసీసెల్ అధ్యక్షులు ఉమాకాంత్, నర్సింగ్‌ప్రసాద్, ఆర్.మోజెస్, బల్ల శ్రీనివాస్‌రెడ్డి, రాజేష్‌కుమార్, శివముదిరాజ్ తదితరులున్నారు.

కళాకారులతో భారీ ర్యాలీ..

- ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మనగర్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ బాకారం నుంచి హెరిటేజ్ ఫంక్షన్ హాల్ వరకు సాగింది.
- బోనాలు, పోతరాజులు, కోలాటం, కళాకారుల నృత్యాలు, డీజే పాటలకు అనుగుణంగా యువకుల నృత్యాలతో సందడి చేశారు.

మాజీ ప్రజా ప్రతినిధులకు గౌరవ వేతనం చెల్లించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసిన స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులకు ప్రతినెల రూ.12 వేల చొప్పున జీవిత కాలం గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. త్వరలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టనున్నట్లు మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, కౌన్సిలర్స్ యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మంచాల వెంకటస్వామి స్పష్టం చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు, పురపాలక ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సామాజిక సేవలు అందించిన మాజీ ప్రజా ప్రతినిధులను ప్రభుత్వం గుర్తించకపోవడం విచారకరమన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఎంపీలకు చెల్లిస్తున్న తరహాలో మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, కౌన్సిలర్లకు గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో సైతం కీలక పాత్ర పోషించామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాజకీయం, ఆర్థికంగా నష్టపోయిన మాజీ ప్రజాప్రతినిధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాయితీ రుణాలు, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఆయన కోరారు. తమ డిమాండ్ల సాధనకు పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని వివరించారు.

అంబేడ్కర్ జయంతి వేడుకలు



రాష్ట్ర దళిత సేన మహిళా విభాగం అధ్యక్షురాలు రెడ్డిమల్ల పార్వతి తదితరులు

ముషీరాబాద్: రాష్ట్ర దళిత సేన మహిళా విభాగం అధ్యక్షురాలు రెడ్డిమల్ల పార్వతి ఆధ్వర్యంలో బాబా సాహెబ్ అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలు సత్యనగర్ గోల్డెన్ జూబ్లీ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. జనశక్తి ముజ్దూర్ సభ ప్రెసిడెంట్ ఎస్.చైనయ్య, ఉపాధ్యక్షులు దారశంకరయ్య, మునికుమార్, రవీందర్, చంద్రకళ, ప్రమీల, హేమలత తదితరులున్నారు.

'హిమోఫిలియా' బాధితులకు ఉచిత వైద్యం అందించాలి

'వికలాంగుల హక్కుల జాతీయ వేదిక' డిమాండ్



అవగాహన కల్పిస్తున్న 'వికలాంగుల హక్కుల జాతీయ వేదిక' రాష్ట్ర కార్యదర్శి అడవయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: 'హిమోఫిలియా' బాధితులకు ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందించడంతో పాటు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని 'వికలాంగుల హక్కుల జాతీయ వేదిక' రాష్ట్ర కార్యదర్శి ఎం.అడవయ్య, కోశాధికారి ఆర్.వెంకటేష్‌లు డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద అంతర్జాతీయ హిమోఫిలియా దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో హిమోఫిలియా వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. హిమోఫిలియా వ్యాధి ఉన్నట్లు చాలా మందికి తెలియదని ఇది అంటు వ్యాధి కాదన్నారు.

- హిమోఫిలియా రుగ్మత ప్రతి పదివేల మందిలో ఒకరికి వస్తుందని ఓ అధ్యాయనంలో తేలిందన్నారు.
- హిమోఫిలియా చికిత్స కేంద్రాల నిర్వహణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ఉచితంగా చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సహాయ కార్యదర్శి దశరథ్, నాయకులు శశికళ, కవిత, చిట్టెమ్మ, శిరీషా, శ్రవంతి, నందు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ఫీజుల పెంపుపై వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ట్యూషన్ ఫీజు పెంపుపై విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డికి సోమవారం ఓయూ రీసెర్చ్ స్కాలర్స్ వినతి పత్రం అందజేశారు. త్వరలోనే వీసీ ప్రొ.రవీందర్‌తో మాట్లాడుతానని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆజాద్, మహేష్, కిరణ్ పేర్కొన్నారు.

ఏబీవీపీ వినతి పత్రాలు..

పీహెచ్‌డీ ట్యూషన్ ఫీజు తగ్గింపుతో పాటు ఓయూ విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు జీవన్ ఆధ్వర్యంలో 12 మంది డీన్లు, ఇతర అధికారులకు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. సకాలంలో పీజీ అడ్మిషన్లు చేపట్టి ఫెలోషిప్‌లు అందచేయాలని, ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి కల్పించాలని వినతి పత్రాలలో కోరారు.

అనాలోచిత నిర్ణయాలు.. ఇబ్బందుల్లో విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అధికారుల అనాలోచిత నిర్ణయాలతో లా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. కేవలం ఒక రోజు ముందు పరీక్ష కేంద్రాన్ని మార్చి హాల్ టిక్కెట్లు జారీ చేయడంతో బషీర్‌బాగ్ పీజీ న్యాయ కళాశాల విద్యార్థులు ఓయూ క్యాంపస్‌లోని పాలన భవనం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఐదేళ్ల ఎల్ఎల్‌బీ సెమిస్టర్ పరీక్షలు నేటి (18న) నుంచి ప్రారంభం కానుండగా ఈ నెల 17న హాల్ టికెట్లను జారీ చేశారు. అయితే గతంలో ఉన్న అదే కాలేజీలో పరీక్ష సెంటర్ (సెల్ఫ్ సెంటర్) కు కాకుండా నారాయణగూడ కేశవ మెమోరియల్ కాలేజీ, బాగ్‌లింగంపల్లి అంబేడ్కర్ కాలేజీల్లో సెంటర్లను ఏర్పాటు చేశారు. హఠాత్తుగా పరీక్ష కేంద్రాన్ని మార్చడంతో ఆగ్రహించిన లా విద్యార్థులు ఓయూ పాలన భవనం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పరీక్షలకు వారం రోజుల ముందు హాల్ టికెట్లు జారీ చేయాలనే నిబంధన ఉన్నా పట్టించుకోకుండా ఒక రోజు ముందు హాల్ టికెట్లు ఇచ్చి, పరీక్ష కేంద్రాన్ని మార్చడం ఓయూ పరీక్షల నిర్వహణ అధికారి పనితనానికి నిదర్శనమని మండిపడ్డారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

లాలాపేట: మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయం వద్ద సోమవారం ముస్లింలకు రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రంజాన్ పండుగను ఆనందోత్సవాలతో జరుపుకోవాలనే ఉద్దేశంతో నిరుపేద ముస్లింలకు రంజాన్ తోఫాల పంపిణీ, ఇఫ్తార్ విందుల వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందన్నారు.



రంజాన్ తోఫాలు పంపిణీ చేస్తున్న శ్రీలత శోభన్‌రెడ్డి

తాగునీటి పైప్‌లైన్ మరమ్మతు పనుల పరిశీలన



తాగునీటి పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లో గత కొద్ది రోజులుగా ప్రజలు తీవ్ర మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. సమస్యను కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్ జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సోమవారం అధికారులు, సిబ్బందితో కలిసి చెప్పల్‌బజార్ ప్రాంతంలో పర్యటించి మంచినీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంచినీటి సమస్యను గుర్తించి పైపులైన్ మర్మత్తు పనులు చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కన్నె రమేష్ యాదవ్, హనుమంతరావు, వెంకటేష్, రమాదేవి, బీమ్‌రాజ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలని నిమ్స్ కార్మికుల ఆందోళన

- భోజన విరామ సమయంలో కార్మికుల నిరసన
- కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్



నిమ్స్‌లో ఆందోళన చేస్తున్న కార్మికులు

లక్డీకాపూల్: నిమ్స్‌లో ఏళ్ల తరబడి పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. సోమవారం నిమ్స్‌లో వేతనాలు పెంచాలని కోరుతూ భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఇ.నరసింహా మాట్లాడుతూ... చాలీచాలని వేతనాలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నా యాజమాన్యం పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఇప్పటికే అన్ని విభాగాల అధిపతులకు వినతి పత్రాలను సమర్పించామన్నారు. ఈ క్రమంలో నిమ్స్ డైరెక్టర్ విజ్ఞాపన పత్రాన్ని అందజేసి పది రోజులు కావస్తోందన్నారు. దీంతో భోజన విరామ సమసయంలో గంట పాటు తమ నిరసన ప్రకటించనున్నామన్నారు. ఇప్పటికీ యాజమాన్యం స్పందించని పక్షంలో నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో యూనియన్ అధ్యక్షుడు ఎం. వెంకటేష్ నేతృత్వంలో జీతాల పెంపుదల విషయమై లేబర్ కమిషనర్‌తో చర్చలు జరిపామన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 21 వేలు చొప్పున వేతనం పెంచుతామని యాజమాన్యం ఇప్పటికే హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. లేబర్ కమిషన్ ముందు ఒప్పందం జరిగిన సంవత్సరం కావస్తున్నా ఇప్పటి వరకు అతీగతి లేకుండా పోయిందని వాపోయారు. ఇకనైనా పెరిగిన వీడియో పాయింట్లు, 2019, ఎరియర్స్ రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. ఉద్యోగ విరమణ చేసిన కార్మికులకు కూడా వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా సీనియారిటీ ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ప్రదర్శనలో యూనియన్ నాయకులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీ కార్నర్ మీటింగ్‌కు కార్యకర్తలు సిద్ధం కావాలి



సమావేశంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.గౌతమ్‌రావు

అంబర్‌పేట: ప్రజలకు మరింత చేరువయ్యేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు సూచించారు. శక్తి కేంద్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కార్నర్ మీటింగ్‌లు అంబర్‌పేట్ నియోజకవర్గంలో త్వరలో ఏర్పాటు చేసి ప్రజా సమస్యలపై గళమెత్తాలన్నారు. సోమవారం గోల్నాక డివిజన్ పార్టీ కన్వీనర్ మూల రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో శక్తి కేంద్రాల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశానికి గౌతమ్‌రావు హాజరై బూత్‌స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. బీజేపీ నాయకులు శ్యామ్‌రాజ్, శ్రీధర్‌గౌడ్, సీహెచ్ వేణుగోపాల్, అరుణ్‌కుమార్, శ్రీనివాస్, శంకర్‌గౌడ్ తదితరులున్నారు.

ముషీరాబాద్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడి మృతి



సత్యనారాయణ (ఫైల్)

ముషీరాబాద్: ముషీరాబాద్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు, రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. గంగపుత్ర సంఘం అధ్యక్షుడిగా ఎనలేని సేవలందించిన సత్యనారాయణ మృతి చెందడంతో నగరంలోనే అతిపెద్దదైన ముషీరాబాద్ చేపల మార్కెట్‌ను మూసి వేశారు. విషయం తెలుసుకున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పూసల గోరఖ్‌నాథ్, దీన్‌దయాల్‌రెడ్డి, గంగపుత్ర సంఘం హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు గాండ్ల గణేష్, నగర గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షులు మీసాల ప్రసాద్‌లు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన అంత్యక్రియలు పార్సిగుట్టలోని శ్మశానవాటికలో నిర్వహించారు.

ముగిసిన హరికథాగాన మహోత్సవాలు



హరికథా గానం చేస్తున్న జయంతి సావిత్రి భాగవతారిణి

నల్లకుంట: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణ దాస, హరికథా కేసరి దివంగత నేతి లక్ష్మీనారాయణ భగవతుల శిష్య బృందం సంయుక్తాధ్వర్యంలో నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో నిర్వహిస్తున్న సంస్మరణ పూర్వక హరికథాగాన మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు జయంతి సావిత్రి భాగవతారిణిచే నిర్వహించిన సామ్రాజ్యసిద్ధి హరికథాగానం ఆహుతులను ఆకట్టుకుంది. డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తి వయోలిన్‌పై కాపవారపు సుబ్బారావు మృదంగంపై వాద్య సహకారం అందించారు. ముఖ్య అతిథిగా హరికథా పరిశోధకురాలు డాక్టర్ ప్రభల జానకి హాజరై మాట్లాడారు. విశిష్ట అతిథిగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ ఎస్. అనంతలక్ష్మితో కలిసి కె.నాగమణి భాగవతారిణిని సన్మానించారు. సమన్వయ కర్తలుగా బుర్రా పద్మనాభ శర్మ భాగవతులు, యనమండ్ర వెంకట కృష్ణయ్య వ్యవహరించారు.

లీకేజీపై సీబీఐతో సమగ్ర విచారణ జరపాలి

- నిరసన దీక్షకు తరలిరావాలి
- ప్రొఫెసర్ కోదండరామ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



నిరుద్యోగ అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

చిక్కడపల్లి: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ల లీకేజీపై సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. అఖిలపక్ష నేతల ఆధ్వర్యంలో ధర్నాచౌక్ వద్ద మంగళవారం నిర్వహించ తలపెట్టిన నిరసన దీక్షకు సబంధించిన కరపత్రాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరామ్, బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, న్యూడెమోక్రసీ నేత పోటు రంగారావులు మాట్లాడారు. నిరుద్యోగులు, విద్యార్థులు మంగళవారం నాటి దీక్షకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 8 సంవత్సరాలకు ఉద్యోగ నోటిఫికేషన్‌లు విడుదల చేసిన ప్రభుత్వం ఏ ఒక్క పరీక్ష కూడా సక్రమంగా నిర్వహించలేదని మండిపడ్డారు. దోషులను కఠినంగా శిక్షించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని, రాసిన ప్రతి నిరుద్యోగులకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయం, త్యాగరాయ గాన సభ, వివిధ ఫంక్షన్ హాళ్లలో పోటీ పరీక్షల కోచింగ్ నిర్వహిస్తున్న కేంద్రాల వద్ద కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో టీజేఎస్ గ్రేటర్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య, న్యూడెమోక్రసీ నేత కె.గోవర్ధన్, చలపతిరావు, పరుశురామ్, సలీమ్‌పాషా, టీజేఎస్ ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రవీందర్‌యాదవ్, అంజయ్‌గౌడ్, వెంకటయ్య, జైపాల్‌రెడ్డి, బట్టల రామ్‌చందర్, శివ, సురేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫెక్షన్ల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో ఇన్ఫెక్షన్లను నియంత్రించి నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామని సూపరింటెండెంట్ రాజారావు అన్నారు. ఆస్పత్రి సెమినార్ హాల్లో సోమవారం జరిగిన ఇన్ఫెక్షన్ల నియంత్రణ కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఇన్ఫెక్షన్‌లను నియంత్రించేందుకు 16 అంశాలతో చెక్‌లిస్ట్ తయారు చేశామని, ఆపరేషన్, పోస్ట్ ఆపరేషన్, ఐసీయూ, హైడిపెండెన్సీ నాలుగు యూనిట్లుగా విభజించి, రెండు ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సు (ఐసీఎన్), ఒక కంట్రోల్ ఆఫీసర్ (ఐసీఓ) పోస్టులను క్రియేట్ చేసి నియామకం చేపట్టామన్నారు. సర్జికల్ సైట్ ఇన్ఫెక్షన్ (ఎస్ఎస్ఐ), నీడిల్ స్టిక్ ఇంజ్యూరీస్ (ఎన్ఎస్ఐ), పోస్ట్ ఎక్స్‌పోజర్ ప్రొఫలాక్సీ, క్యాథటర్ అసోషియేటెడ్ యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు తదితర ప్రాంతాల్లో వైరస్, ఫంగస్, బాక్టీరియాల జాడను తెలుసుకునేందుకు ఎయిర్ శాంప్లియర్ మెషిన్‌లు ఏర్పాటు చేశామని, ఫ్లోర్ ఆర్ఎంఓలను ఏర్పా టు చేసి ప్రతిరోజు నివేదికలను పరిశీలిస్తున్నామన్నారు.